
కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

## ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందే

విద్యానగర్, మార్చి 19: ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 6 గంటలకే కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేయగా, పోలీసులు 250 మందిని అరెస్ట్ చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుంద రెడ్డి, ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటుకు వారు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రంగవేని శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి మార్రేళ్ల శ్రీలత, యూనియన్ నాయకులు లత, వెంకటలక్ష్మి, సత్యలక్ష్మి, స్వప్న, విజయలక్ష్మి, రజిత, రజియా బేగం, సరోజన, పద్మ, లక్ష్మి, శంకరమ్మ, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లుల కోసం ఎంతకైనా తెగిస్తాం

- అధికార పార్టీ నేతలను గ్రామాల్లో తిరగనివ్వబోం
- మాజీ సర్పంచుల హెచ్చరిక


మాట్లాడుతున్న మాజీ సర్పంచుల ఐక్యవేదిక అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం తదితరులు

కలెక్టరేట్, మార్చి 19 : రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లోని అభివృద్ధి పనుల బిల్లుల కోసం ఎంతదాకనైనా తెగిస్తామని, అవసరమైతే మావోయిస్టులుగా కూడా మారుతామని మాజీ సర్పంచులు హెచ్చరించారు. బుధవారం ఆసంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఫిలీం భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం మాట్లాడుతూ, మాజీ సర్పంచుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తూర్పార బట్టారు. తమపై బీఆర్ఎస్ ముద్ర వేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండడం అమానుషమన్నారు. తెచ్చిన అప్పులు తడిసి మోపెడై, తమ కుటుంబాలు దివాళా తీసే పరిస్థితులు ఎదుర్కొంటున్నామంటూ భావోద్వేగానికి గురయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయి పర్యటనలు చేపడితే తమ ఇళ్లల్లోకి అర్ధరాత్రి చొరబడి, అరెస్టులు చేయడం ప్రభుత్వ నిరంకుశ విధానానికి పరాకాష్టగా మారిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు నిధులు విడుదల చేయకపోతే, గ్రామాల్లో అధికార పార్టీ నేతలను తిరగనివ్వబోమని అల్టిమేటం జారీ చేశారు. తమ పట్ల ఇదే ధోరణి చూపితే ఆత్మాహుతి చేసుకునేందుకైనా సిద్ధమేనని ప్రకటించారు. ప్రభుత్వ అండతో శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులే అశాంతికి మూలకారకులవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా మారి మాజీ సర్పంచులపై భౌతికదాడులకు పాల్పడుతుండడం శోచనీయమన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర నాయకులు పంజాల జగన్‌మోహన్ గౌడ్, మేడి అంజయ్యలు మాట్లాడగా, మేచినేని నవీన్‌రావు, కంకణాల విజేందర్‌రెడ్డి, సిరిమల్ల మేఘరాజు, సురేందర్, గంగాధర్, ఆదిమల్లు, రామకృష్ణ, సమ్మయ్య, నజీర్‌తో పాటు పలువురు మాజీ సర్పంచులు పాల్గొన్నారు.


సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

## పెండింగ్ జీతాలివ్వకుంటే సమ్మె తప్పదు

విద్యానగర్, మార్చి 19: తమకు రావాల్సిన రెండు నెలలు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, లేదంటే పనులు బంద్ పెట్టి సమ్మెలోకి వెళ్తామని ప్రభుత్వ దవాఖాన కార్మికులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ దవాఖాన వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (టీయూసీసీ) ఆధ్వర్యంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా జాతీయ కమిటీ సభ్యుడు, ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానలో దాదాపు 250 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్, వైద్యాధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సమ్మె నోటీస్ ఇవ్వవలసి వచ్చిందని, ఏప్రిల్ 4 నుంచి కార్మికులు పనులు బంద్ పెట్టి సమ్మెలోకి పోతారని తెలిపారు. ఇక్కడ ప్రభుత్వ దవాఖాన వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.అరుణ్, కార్యదర్శి పి.కళావతి, కార్మికులు రాజు, అనిల్, బాలయ్య, మహేశ్, మల్లేశం ఉన్నారు.

## ఆహార నాణ్యత తనిఖీలు విస్తృతంగా చేపట్టాలి

కలెక్టరేట్/విద్యానగర్, మార్చి 19 : జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, హోటళ్లు, ఆహారం తయారు చేసే కేంద్రాల్లో నాణ్యత తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. జిల్లాస్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆహార కల్తీ, నాసిరకమైన ఆహారం తయారు చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆహార తయారీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వంట గదులు, వాష్ ఏరియా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వీధి వ్యాపారులకు ఆహార భద్రతపై అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుజాత, డీడబ్ల్యూవో సబిత, డీఎస్‌వో శ్రీనివాస్, డీఏవో భాగ్యలక్ష్మి, డీఈవో జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జైలును సందర్శించిన సీపీ

కరీంనగర్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం కరీంనగర్ జైలును సందర్శించారు. జైలు సెక్యూరిటీతో పాటు జైలులో ఉన్న పరిశ్రమలను పరిశీలించారు. అనంతరం జైలులో ఖైదీల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, హాస్పిటల్, మహిళా జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జైలు అధికారులతో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును గురించి ఆరా తీశారు. జైలును పరిశుభ్రంగా నిర్వహిస్తున్నందుకు, పెట్రోల్ బంక్ ద్వారా ప్రజలకు సమర్థవంతంగా సేవలందిస్తున్నందుకు జైలు అధికారులను అభినందించారు. సీపీ వెంట ప్రొబేషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ ఉండగా, కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జి. విజయ డేని, జిల్లా జైలు మెడికల్ అధికారి వేణుగోపాల్, జైలర్ బి. రమేశ్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస రెడ్డి, సుధాకర్ రెడ్డి , రమేశ్, అజయ్ చారి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నగరంలో నీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

కార్పొరేషన్, మార్చి 19: వేసవి కాలంలో నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని సప్తగిరి కాలనీ, రాంనగర్, శివనగర్ ప్రాంతాల్లో పర్యటించి నీటి సరఫరాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నగర వ్యాప్తంగా రిజర్వాయర్ల వారీగా విధులు నిర్వర్తించే ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది మంచి నీటి సరఫరా సమయంలో తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. పైపు లైన్ లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాలన్నారు. అలాగే మోటర్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. కాలనీల్లో నివాస గృహాలను తనిఖీ చేయాలన్నారు. నీటిని వృథాగా వదిలేసే వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. మానేరు డ్యాంలో రోజు రోజుకూ నీటి మట్టం తగ్గుతున్నందున ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, లైన్‌మెన్‌లు, ఫిట్టర్లు పాల్గొన్నారు.

## స్వచ్ఛతలో చామనపల్లి భేష్: రాజస్థాన్ రాష్ట్ర బృందం కితాబు

కరీంనగర్ రూరల్, మార్చి 19: స్వచ్ఛత, పచ్చదనంలో కరీంనగర్ మండలం చామనపల్లి భేష్ అని రాజస్థాన్ రాష్ట్ర ప్రజాప్రతినిధుల బృందం ప్రశంసించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలో చేపట్టిన పనుల గురించి యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి, ప్రత్యేక అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కే మహేందర్‌రావు వివరించారు. అనంతరం నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, అమృత్ సరోవర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రకృతివనం, క్రీడాప్రాంగణం, ఓపెన్ జిమ్స్‌తోపాటు పారిశుధ్యం, పచ్చదనం కోసం చేపడుతున్న పనులను పరిశీలించి అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఉపాధి పనుల వినియోగంలో గ్రామం ఆదర్శంగా నిలిచిందని కితాబిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో హరికిషన్, ఎంపీడీవో ఏ సంజీవరావు, గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీవో సీహెచ్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్‌బీఎం రమేశ్ తదితరులు ఉన్నారు.

## 'స్వప్నం రాల్చిన అమృతం'కు ఉత్తమ బహుమతి

ముకరంపుర, మార్చి 19: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15నుంచి 18 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటికల పోటీల్లో విద్యుత్ సంస్థ కరీంనగర్ సర్కిల్ కళాకారులు ప్రదర్శించిన స్వప్నం రాల్చిన అమృతం నాటికకు ఉత్తమ బహుమతి లభించింది. అలాగే ఉత్తమ నటుడిగా మంచాల రమేశ్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు కరీంనగర్ స్పోర్ట్స్ సెక్రటరీ ఈఎల్పీ రాజు వెల్లడించారు. అవార్డులను ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ అందజేశారు. నాటికను పరమాత్ముని శివరాం రచించగా, మంచాల రమేశ్ దర్శకత్వం వహించారు. నాటికల పోటీల్లో సర్కిల్ బహుమతులు సాధించిన కళాకారులను ఎస్ఈ రమేశ్ బాబు, ఎస్ఏవో రాజేంద్రప్రసాద్, పలువురు ట్రేడ్ యూనియన్ నాయకులు అభినందించారు.

## టాటా కమ్యూనిటీ ట్రస్ట్‌తో ఎస్సారార్ కళాశాల ఎంవోయూ

కమాన్‌చౌరస్తా, మార్చి 19 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ అటానమస్ కళాశాల విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు టాటా కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ట్రస్ట్ టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌తో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే రామకృష్ణ, కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి టి. రాజయ్య, డాక్టర్ బూర్ల నరేశ్, డాక్టర్ ఆర్ రామకృష్ణ, టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రతినిధి కట్కం రాజ శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 73 కేంద్రాలు.. 12,516 మంది విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, మార్చి 19 : ఈ నెల 21 నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమవుతున్న పదో తరగతి పరీక్షల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందు కోసం 73 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 12,516 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, ఇందులో బాలురు 6,618 మంది, బాలికలు 5,898 మంది ఉన్నారు. అలాగే, 23 మంది బ్యాక్‌లాగ్‌లో పరీక్ష రాయనున్నారు. దాదాపు 694 మంది ఇన్విజిలేటర్లను అందుబాటులో ఉంచారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలోని దాదాపు అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. పరీక్షల నిర్వహణలో సుమారు 694 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించనున్నారు. అలాగే 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 73 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. అలాగే మాస్ కాపీయింగ్‌ను నిరోధించడానికి 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాకు రాష్ట్ర పరిశీలకులు ఒకరు ఉంటారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

## అట్టహాసంగా 'ఫ్లోరెంట్'

కమాన్‌చౌరస్తా, మార్చి 19 : జిల్లా కేంద్రంలో వావిలాలపల్లి అల్ఫోర్స్ టైని టాట్స్ ప్రాంగణంలో 'ఫ్లోరెంట్' పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు అట్టహాసంగా సాగాయి. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కృషిచేసి అన్ని రంగాల్లో పైచేయి సాధించాలన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యువజనోత్సవాలు



ఉత్సవాల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్, మార్చి19: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ వెంకటరాంబాబు మాట్లాడుతూ, జిల్లా స్థాయి యువజనోత్సవంలో భాగంగా వివిధ రకాల నైపుణ్యాల్లో పోటీలు నిర్వహించామని తెలిపారు. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. విజేతలకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. వాగేశ్వరి విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల వసూలులో రాష్ట్రంలో ముందంజ

- జమ్మికుంట, హుజూరాబాద్ బల్దియాల రికార్డు

జమ్మికుంట/హుజూరాబాద్ టౌన్, మార్చి19: ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేసి జమ్మికుంట, హుజూరాబాద్ బల్దియాలు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచాయి. జమ్మికుంట బల్దియాలో 12,485 ఇండ్లు ఉండగా, మొత్తం రూ. 3 కోట్ల 5 లక్షల 24 వేల పన్నులు వసూలు చేశారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో 8,917 నివాసాలు ఉండగా, రూ.2 కోట్ల 64 లక్షల బకాయిలు పూర్తిగా వసూలయ్యాయి. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్‌ను అడిషనల్ కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి ప్రఫుల్ దేశాయ్, తదితరులు అభినందించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అయాజ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వంద శాతం వసూలు చేసిన అధికారులు, సిబ్బందిని కమిషనర్ ఘనంగా సన్మానించారు. అలాగే పన్నుల వసూళ్లకు ఎప్పటికప్పుడు వెన్నంటి ఉంటూ.. ప్రోత్సహించిన కమిషనర్‌ను అధికారులు, సిబ్బంది సన్మానించారు. హుజూరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి కమిషనర్ సమ్మయ్య కేక్ కట్ చేశారు. వందశాతం పన్నుల వసూలులో సహకరించిన మున్సిపాలిటీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలను నిరాశపరిచిన బడ్జెట్

తెలంగాణచౌక్,మార్చి19: రాష్ట్ర బడ్జెట్ ప్రజలను తీవ్రంగా నిరాశపరిచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పేర్కొన్నారు. ప్రాధాన్యత రంగాలకు తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఆరుగ్యారెంటీలకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా వాటిని ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. బడ్జెట్ సవరించి ప్రాధాన్యతా రంగాలకు నిధుల పెంచాల్సిన అవసరం ఉందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యారంగానికి నిధుల కేటాయింపులో అన్యాయం

కమాన్‌చౌరస్తా, మార్చి 19 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.5శాతంనిధులు మాత్రమే విద్యకు కేటాయించి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ దానిని నిలబెట్టుకోలేదని విమర్శించారు. బడ్జెట్ ప్రసంగంలో ఉన్నత విద్య బలోపేతం, ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, విద్యార్థులకు ఇచ్చిన హామీల ఊసే లేదని పేర్కొన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించి, విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జమ్మికుంట, మార్చి19: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని హనుమకొండ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ చంద్రమౌళి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ అధ్యక్షతన 'భారతీ సాహిత్యంలో పర్యావరణ పరికల్పన' పై రెండో రోజు సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతోనే సకల జీవుల మనుగడ సాధ్యమన్నారు. అంతకుముందు సదస్సుకు హాజరైన 50 మంది ప్రొఫెసర్లు, అధ్యాపకులు పర్యావరణ పరికల్పనపై పత్ర సమర్పణ చేశారు. పర్యావరణానికి సంబంధించిన రచనల గురించి చర్చించారు. తర్వాత సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులు, ప్రొఫెసర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఇక్కడ అధ్యాపకులు, ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

## ఎండిన పంటల పరిశీలన

చిగురుమామిడి, మార్చి 19: మండలంలోని లంబాడిపల్లి, గాగిరెడ్డిపల్లితో పాటు పలుగ్రామాల్లో సాగు నీరందక ఎండిన వరి, మక్క పంటలను సీపీఐ, రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఎండిన పంటలను సర్వే చేయించి బాధిత రైతులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

## కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

మానకొండూర్ రూరల్, మార్చి 19: లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తాండ్ర దేవయ్య (55) బుధవారం కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దేవయ్య తన ఇంటి డాబాపైకి ఎక్కి పరదను తీసుకొచ్చే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. పిల్లర్‌కు ఉన్న ఇనుప రాడ్‌కు విద్యుత్ ప్రసారమై షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దేవయ్య తండ్రి ఇటీవలే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కరెంట్ షాక్‌తో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**రామకృష్ణకాలనీ శివారులో నెమలి**

తిమ్మాపూర్, మార్చి 19: రామకృష్ణకాలనీ శివారులో ఎల్ఎండీ రిజర్వాయర్ పరిసర ప్రాంతంలో జాతీయ పక్షి నెమలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. బుధవారం సాయంత్రం అటుగా వెళ్లిన గ్రామ పంచాయతీ మెకానిక్ కవ్వంపల్లి అంజయ్య.. నెమలి మృతి చెంది ఉండడాన్ని గమనించారు. ఫారెస్ట్ బీట్ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి మృతిచెందిన నెమలిని పోస్టుమార్టం కోసం తీసుకెళ్లారు. నెమలి మృతిచెందిన పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఎగిరే క్రమంలో వైర్లకు తాకి షాక్‌తో మృతి చెంది ఉంటుందని అధికారులు తెలిపారు.

## నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి


తెలంగాణచౌక్, మార్చి 19: రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ప్రతి క్షౌరశాలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. కానీ, నేడు ఉచిత విద్యుత్ బిల్లు వస్తున్నా సబ్సిడీ రావడం లేదని విద్యుత్ శాఖ అధికారులు బిల్లులు చెల్లించాలని షాపు యాజమానుల మీద ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల్లో నాయీబ్రహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మార్చి 19 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నిర్వహించిన కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షతో ముగిశాయి. ఈ పరీక్షలకు మొత్తం 19 వేల మంది విద్యార్థులకు గానూ 18,348 మంది హాజరయ్యారని డీఐఈవో జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆఖరు రోజు డీఐఈవో, డీఈసీ, హెచ్‌పీసీ, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మొత్తం 30 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

## కల్వల ప్రాజెక్టుకు మరోసారి గండి

శంకరపట్నం, మార్చి 19: మండలంలోని కల్వల ప్రాజెక్టు తాత్కాలిక కట్టకు మరోసారి గండి పడింది. కేశవపట్నం వద్ద ఎస్సారెస్పీ కెనాల్ ఎస్కేప్‌ను కొందరు ఇష్టారీతిన పైకి లేపడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద చేరి మరోసారి కట్ట తెగింది. దీంతో శంకరపట్నం, వీణవంక మండలాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 2023 జూలైలో భారీ వర్షాలు, వరదలకు మత్తడి వద్ద గండి పడి నీరంతా వృథాగా పోయి ప్రాజెక్టు వట్టిపోయింది. అప్పటి నుంచి ప్రాజెక్టులోకి వచ్చిన నీరు వచ్చినట్లు బయటకు వెళ్తున్నది. గత సీజన్‌కు ముందు వీణవంక మండలానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో స్వయంగా పూనుకొని జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి మత్తడికి అడ్డంగా తాత్కాలిక కట్టను ఏర్పాటు చేశారు. అయితే అది కూడా కొట్టుకుపోగా, ఇటీవల రైతులు తాజాగా మరోసారి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి తెగిన చోట అడ్డంగా మరో తాత్కాలిక కట్టను ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం వీణవంక మండలానికి చెందిన కొందరు వ్యక్తులు కేశవపట్నం ఎస్కేప్‌ను ఇష్టారీతిన పైకి ఎత్తడంతో భారీగా వరద ప్రవహించింది. ముత్తారం రామసముద్రం చెరువు మీదుగా కల్వల ప్రాజెక్టులోకి ఒక్కసారిగా చేరడంతో బుధవారం మరోసారి తాత్కాలిక కట్టకు సైతం గండి పడింది. దీంతో ప్రాజెక్టులో ఉన్న నీరంతా వృథాగా పోతున్నది. నీటి నిర్వహణలో ఎస్సారెస్పీ అధికారుల నిర్లక్ష్యం, కొందరు వ్యక్తుల అత్యుత్సాహం వెరసి ప్రాజెక్టు మరోసారి ఖాళీ అయింది. దీంతో శంకరపట్నం, వీణవంక మండలాలకు చెందిన రైతులు అధికారుల నిర్వహణ లోపం వల్లే తమకు మరోసారి నష్టం జరిగినట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గండి పడడంతో కల్వల ప్రాజెక్టు నుంచి వృథాగా పోతున్న నీరు

## విగ్రహాలను ఆవిష్కరిస్తే నష్టమేంటి..?


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

తిమ్మాపూర్, మార్చి19: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలను ఆవిష్కరిస్తే వచ్చే నష్టం ఏంటని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలో విగ్రహాల ఆవిష్కరణ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. జేఏసీ కన్వీనర్లు, నాయకులతో కలిసి విగ్రహాలను పరిశీలించారు. ఆవిష్కరించేలా అవసరమైతే ముఖ్యమంత్రిని కలుస్తామని చెప్పారు. రెండేండ్ల నుంచి మహనీయుల విగ్రహాలకు ముసుగులు వేసి ఉంచడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. అలాగే పాదయాత్రగా వెళ్తున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సైతం దీక్ష స్థలంలో కూర్చుని సంఘీభావం ప్రకటించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ల్యాగల వీరారెడ్డి, బోయిని కొమురయ్య, కనకం రాములు, మేడి అంజయ్య, ఎలుక ఆంజనేయులు, గంటల రేణుక, జేఏసీ నాయకులు సుగుర్తి జగదీశ్వరాచారి, మాతంగి శంకర్, వంతడుపుల సంపత్, పొన్నం అనిల్, అబాల సతీశ్, కోయ మురళి, బోయిని తిరుపతి, పార్నంది జలపతి, తదితరులు పాల్గొన్నారు.

## పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు


పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియల్లో బూర్గుల అభిరామ్

సైదాపూర్, మార్చి19: తండ్రి చనిపోయిన బాధలోనూ పరీక్షకు హాజరయ్యాడు ఇంటర్ విద్యార్థి. కుటుంబసభ్యులు ధైర్యం చెప్పడంతో పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష రాశాడు.. వివరాల్లోకి వెళ్తే.. సైదాపూర్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన బూరుగుల అభిరామ్ సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సుమారు నెల రోజుల క్రితం మానకొండూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి తండ్రి రాజేశ్వరరావు హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి మరణంతో అభిరామ్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చివరి పరీక్ష కావడంతో కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పాడు. దాంతో కళాశాలకు వచ్చి పరీక్ష రాశాడు. అనంతరం వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

## గోదావరి గోస పాదయాత్ర

తిమ్మాపూర్ రూరల్, మార్చి 19: గోదావరి తల్లి కన్నీటి గోస నినాదంతో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన మహాపాదయాత్ర బుధవారం తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల మీదుగా రాజీవ్ రహదారిపై కొనసాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి ఘనస్వాగతం పలికారు.

## నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మార్చి 19: ట్రాన్స్ ఫార్మర్, ఏబీ స్విచ్ పనులు చేపడుతున్నందున నగరంలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు తిరుమల నగర్, మౌళి చంద్ర అపార్ట్ మెంట్ ఏరియా
- మధ్యాహ్నం 3.30నుంచి సాయంత్రం 4.30గంటల వరకు కోతి రాంపూర్ మెయిన్ రోడ్డు, కోతి రాంపూర్, గౌతమీ నగర్, హనుమాన్ నగర్, ఐటీ హబ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

చిగురుమామిడి, మార్చి 19: మండలంలోని నవాబ్ పేట్ ఉపకేంద్రంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుందరగిరి, బంజేరుపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

## ఎల్ఎండీలో వృద్ధురాలి మృతదేహం

తిమ్మాపూర్, మార్చి 19: లోయర్ మానేరు జలాశయంలో బుధవారం సాయంత్రం ఓ వృద్ధురాలి శవాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎల్ఎండీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. రిజర్వాయర్‌లో మృతదేహం ఉండగా సమీపంలో ఆధార్ కార్డుతో పాటు బ్యాగును పోలీసులు గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన అందే మల్లవ్వగా గుర్తించి.. స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎల్ఎండీ పోలీసులు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించారు. కాగా, వృద్ధురాలికి సంబంధించిన బంధువులు ఫిర్యాదు ఇవ్వాలేదని పోలీసులు తెలిపారు. అయితే వృద్ధురాలిది హత్యనా? ఆత్మహత్య నా? అనే విషయం తెలియాల్సి ఉంది.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189